గుట్టలు మాయం



కోడేరు ఊరగుట్ట వద్ద హిటాచీతో గుట్టను తవ్వుతున్న దృశ్యం

- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

కోడేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమార్కులు గుట్టలను తవ్వి మట్టిని విక్రయిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు రాజాపూర్, బావాయిపల్లి తదితర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా గుట్టలను తవ్వి మట్టిని అక్రమంగా తరలించుకుపోవడంతో పాటు పచ్చని వృక్ష సంపద కూడా నేలకొరుగుతుంది. ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడేందుకు రూ.లక్షలు వెచ్చించి గుట్టల్లో మొక్కలు నాటిస్తుంటే.. కొందరి స్వార్థానికి గుట్టలు తవ్వే క్రమంలో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. దీంతో వాతావరణ సమతుల్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఎర్రమట్టిని తవ్వి దళారులు సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో బడా నాయకుల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. కొంతకాలంగా ఆయా ప్రాంతాల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లతో రోడ్లు, ఇళ్ల నిర్మాణానికి, రియల్ ఎస్టేట్ లేఅవుట్లకు తదితర వాటికి ఎర్రమట్టిని తవ్వి విక్రయిస్తున్నారు. అదే విధంగా ఎంజీకేఎల్ఐ కాల్వకు ఇరువైపులా ఉన్న మట్టిని సైతం కొంత మంది వ్యాపారులు మట్టిని తవ్వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు జరుగుతుండటంతో రోడ్లన్ని గుంతలమయంగా మారుతున్నాయని, పెద్ద పెద్ద రాళ్ళు సహితం వాహనాల నుంచి కింద పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు పాతర

అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నిబంధనల ప్రకారం అయితే అధికారుల నుంచి అనుమతులు తీసుకొని మాత్రమే మట్టిని తరలించాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండా ఇష్టానుసరంగా మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రాత్రి వేళలో మట్టిని తరలిస్తున్న టిప్పర్ (ఫైల్)

అధికారులు పట్టించుకోవడం లేదు



మండలంలో ఎర్రమట్టిని రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నా రు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడు తుంది. అక్రమంగా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడుతాం.

– లింగన్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు

కఠిన చర్యలు తీసుకుంటాం



మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలిస్తే అటు వంటి వారిపై కఠిన చ ర్యలు తీసుకుంటాం. ఇటీవల అనుమతులు లే కుండా ఇటాచీతో తవ్వి టిప్పర్ల ద్వారా ఎర్రమ ట్టిని తరలిస్తుండగా వాటిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాం.మట్టిని తరలించేందు కు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్, తహసీల్దార్

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



కల్వకోల్ బీసీ కాలనీలో ఇళ్ల ఎదుట నిల్వ ఉన్న మురుగు

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్ బీసీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సైడ్ కాలువలు లేకపోవడంతో సీసీ రోడ్లపై నుంచి మురుగు పారుతూ ఇళ్ల మధ్య నిల్వ ఉంటోంది. దీంతో మురుగు వాసన భరించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు ముందుకు వెళ్లేందుకు సైడ్ కాల్వలు లేకపోవడంతో గ్రామంలోని నీరంతా వచ్చి ఇళ్ల మధ్యనే నిలుస్తోందని గ్రామస్తులు వాపోయారు. దోమలబెడదతో రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా గంప జాతర

మనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెంలో ఘనంగా గ్రామ ప్ర జలు ఆదివారం గంప జాతర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు గంపలను ప్రత్యేకంగా రంగులతో అలకంకరించి, చాట, చీపురు, మస్తి దుస్తులు గంపలో పెట్టుకొని గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామ శివారులో దేవత గుడి దగ్గర నైవేద్యాలు తయారు చేసి, పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గంప జాత రతో గ్రామంలోని అరిష్టాలు తొలగిపోతాయని ప్రజల నమ్మకమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.



పెద్దగూడెంలో గంపలతో మహిళల ఊరేగింపు

బైపాస్ బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలి

చారకొండ: జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే వారికి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహరాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో అయన మాట్లాడారు. బైపాస్ బాధితులు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఆందోళనలు చేపడితే అధికారులు అన్నివిధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీక్షలను విరమించినా ఇప్పటికి సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నల్లమలలో క్రూరమృగాల సంచారం

మన్ననూర్: నల్లమలలో క్రూరమృగాల సంచారిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్ఓ దేవజ, ఎఫ్ఎస్ఓ శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు, లింగమయ్య స్వామి ఆలయం వెనుక భాగం, మూలమలుపు, అటవీశాఖ వన నర్సరీ(రంగాపూర్ సమీపంలో) పరిసర ప్రాంతాల్లో క్రూరమృగాలైన వన్యప్రాణులు చిరుతపులి, ఎలుగు బంటు సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని వివరించారు. ఈ రహదారి వెంట ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు రాత్రి సమ యాల్లో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. వన్య ప్రాణులకు హాని చేయొద్దని సూచించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఇంటిపైన వేలాడుతున్న విద్యుత్ తీగలు

బిజినేపల్లి: మండలంలోని మమ్మాయిపల్లిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇళ్లపై నుంచే విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటి పైకి వెళ్లేందుకు యజమానులు వెనకడుగు వేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల కిందట స్తంభాలను ఏర్పాటు చేశారని ఇవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని వాపోయారు. సంబంధిత అధికారుల స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని, కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యా కమిషన్ చైర్మన్ రాక

వంగూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రానున్నారని ఎంఈఓ మురళీమనోహరాచారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యావిధానంపై విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు విద్యాభిమానులు, ఇతర వర్గాల ప్రజలు కూడా హాజరుకావాలని ఆయన కోరారు.

కానిస్టేబుల్ కుమారుడికి ఎస్పీ అభినందన



నాగర్‌కర్నూల్ క్రైం: ఈ నెల 22న విడుదలైన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 80వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించిన ఐటీ కోర్ కానిస్టేబుల్ విక్రమ్ కుమారుడు అనురాగ్ రెడ్డిని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అభినందించారు. ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పిల్లలు ఉన్నత చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు.

సామర్థ్యానికి మించి.. లారీల్లో తరలించి

పాన్‌గల్: వరి ధాన్యం సేకరణ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో తూకం వేసిన ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా ఆయా కేంద్రాల నిర్వహకులు లారీల్లో గోదాంకు, వారికి కేటాయించిన మిల్లులకు తరలిస్తున్నారు. అయితే లారీల సామర్థ్యానికి మించి బస్తాలు వేయడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గోదాంకు, మిల్లులకు తరలించే క్రమంలో కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో అవి తాకి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ధాన్యం తరలించే వారు లారీల్లో ధాన్యం బస్తాలను సామర్థ్యానికి మించి తరలించొద్దని పలువురు కోరుతున్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని తూడుకుర్తి ప్రభుత్వ పాఠశాలలో చదివిన 1987–1988 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సదర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనాలను చేశారు. తోటి విద్యార్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులై సందర్భంగా శంకర్, సుధాకర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, ఉత్తంరెడ్డి, శైలజ, మల్లెల లత, గోవర్ధన్, చాంద్ పాషా, ఉపాధ్యాయులు బుచ్చారెడ్డి, హనమంత్‌రెడ్డి, రంగారెడ్డి, రాములు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి

లింగాల: ఆదివాసీలు అన్ని రంగాలలో రాణించాలని ఎస్ఐ వెంకటేష్‌గౌడు కోరారు. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న అప్పాపూర్‌పెంట, బౌరాపురం, రాంపూర్‌పెంట, పుల్లాయిపల్లి పెంటలో ఆదివారం ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పర్యటించి ఆదివాసీయులైన చెంచులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వం ఆదివాసీలకు విద్యా పరంగా ఎన్నో రకాలుగా కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దన్నారు. చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని, జీవనోపాధికి ప్రభుత్వం కల్పిస్తున్న వనరులు, ఇతర సౌకర్యాలను ఉపయోగించుకొని ఎదగాలన్నారు. కార్యక్రమంలో చెంచులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

పునాదులకే పరిమితమైన డబుల్ బెడ్రూం ఇళ్లు

తాడూరు: మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పునాదులకే పరిమితం అయ్యాయి. మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ సమీపంలో 2021 ఆగస్టు నెలలో 104 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పునాదులకు వరకు పనులు చేసి నిలిపివేశారు. నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయినట్లు స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



తాడూరులో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

కాంగ్రెస్ నాయకుడికి ఘన నివాళి

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెన్న మల్లయ్య ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. సింగిల్ విండ్ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు గ్రామానికి వెళ్లి మల్లయ్య భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజారెడ్డి, రవికుమార్, జూపల్లి మల్లయ్య, ఆటో శ్రీనివాసులు, ఆంజనేయులు, కురమయ్య, కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విక్టరీ డే



కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతి పేట గ్రామ పంచాయతీ పరిధిలోని రామగిరిలో ఆదివారం స్వేరోస్ ఆధ్వర్యంలో విక్టరీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్ మాట్లాడుతూ తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత స్వేరోలుదేనన్నారు. ఈ సందర్భంగా రామగిరి గుట్టపై చిన్నారులతో కలిసి జాతీయ జెండా, స్వేరోస్ జెండాలను ఎగురవేశారు. 2014 మే 25న మలావత్ పూర్ణ, సాధనాల ఆనంద్ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన రోజు అని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండమీది కృష్ణ, శివశంకర్, ధర్మరాజు, రాము, శేఖర్, సంపత్ కుమార్, మూర్తి సాగర్, పరమేశ్వర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదాం వద్ద అదనపు సిబ్బందిని నియమించండి

వీపనగండ్ల: మండల కేంద్రంలో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల వ్యవసాయ మార్కెట్ గోదామును ఇటీవల అధికారులు ప్రారంభించగా, ధాన్యాన్ని దించుకునేందుకు సరైన సిబ్బంది లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం గోదాం దగ్గరకు వెళ్లే రహదారిలో లారీ దిగబడడంతో పదుల సంఖ్యలో ధాన్యం తీసుకువచ్చిన వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారి నుంచి గోదాముకు వెళ్లే దారిని సీసీ రోడ్డుగా మారిస్తే ఇబ్బందులు తీరుతాయని పలువురు రైతులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారితో పాటు అవసరమైన మేరకు హమాలీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భక్తులకు మరిన్ని సేవలు అందిస్తాం

కల్వకుర్తి రూరల్: అలంపూర్ వాసవీ నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడిగా చిలుకూరు రమేష్ గుప్తా ఎన్నికయ్యారు. సత్రంలో కల్వకుర్తి పట్టణం నుంచి 11 మంది సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆదివారం సత్రం చైర్మన్ రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాపిశెట్టి శ్రీనివాసులు, రవీందర్, గార్లపాటి శ్రీను, దాచేపల్లి శ్రీను తదితరులు ఆయనను సన్మానించారు.

కొల్లాపూర్‌లో భారీ వర్షం



కొల్లాపూర్: పట్టణంలోని ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంట పాటు వర్షం పడింది. రోజంతా చల్లటి గాలులు వీచాయి. వర్షం కారణంగా కాలనీల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయి. వర్షంతో పాటు ఈదురుగాలులు కూడా వీచడంతో మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చినుకు పడితే చాలు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో నడిచేందుకు కూడా వీలు లేకుండా పోతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో నాణ్యత లేకుండా సీసీ రోడ్లు నిర్మించడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో వర్షపు నీరు రోడ్లపైనే నిలుస్తోంది. అధికారులు పరిశీలించి రోడ్లకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

తెలకపల్లి: మండల కేంద్రంలో 122వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రధాని నరేంద్ర మోడీ సందేశాన్ని ఆసక్తిగా విన్నారు. ఉగ్రవాదం, దేశ ఐక్యతపై ప్రసంగించారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవికుమార్, నరేంద్రచారి, చంద్రమోళి, రమేష్, రామకృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మన్ననూరు: ప్రతి నెలలో చివరి ఆదివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా టీవీలలో ప్రసారం చేసే మన్‌కీబాత్ కార్యక్రమాన్ని అమ్రాబాద్ మండలంలోని 262వ బూత్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు గోలి రాజు, ప్రధాన కార్యదర్శి శివ, ఉపాధ్యక్షుడు నోముల రాజు గౌడ్, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగాన్ని వింటున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

కరాటే విద్యార్థులకు బెల్ట్‌ల ప్రదానం



వెల్దండ: మండలంలోని కొట్రలో ఉచితంగా కరాటే నేర్చుకున్న విద్యార్థులకు మాస్టర్ కుమార్ ఆదివారం విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచితంగా కరాటే నేర్పించామన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు కరాటే ప్రతి ఒక్కరికి అవసరం అన్నారు. కార్యక్రమంలో మాంక్స్ కరాటే అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నాగరాజుగౌడ్, సీఆర్పీ ఆంజనేయులు, యువకులు తదితరులు ఉన్నారు.

వెల్గొండ సీపీఐ కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామ నూతన కమిటీని సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నాగోలు శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, సహాయ కార్యదర్శులుగా అస్కని సురేందర్, కుందేళ్ల తిరుపతయ్య, కోశాధికారి పురషోత్తంలు ఎన్నికయ్యారు. కమిటీ సలహాదారులుగా నాగోలు కృష్ణారెడ్డి, కంతం ఆంజనేయులు, సభ్యులుగా నాగోలు శేఖర్‌రెడ్డి, శావుకుల రమేష్, బాబా, అజయ్ బాబు, పంబళ్ల సాయిలు, ఇప్పటి భాగ్యమ్మ, కావలి లక్ష్మీలను ఎన్నుకున్నారు.

హామీలు అమలు చేయాలి

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లమల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. ఆదివారం అమ్రాబాద్ మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలో పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్వాగతం పలుకుతున్నామని నల్లమల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు ప్రతి నెల రూ. 2500 పింఛన్, ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం, మరణించిన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏఎస్ఐకి సన్మానం



తెలకపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న నారాయణ ఏఎస్ఐగా పదోన్నతి పొందాడు. ఈ సందర్భంగా ఆదివారం స్వేరోస్ నాయకులు ఏఎస్ఐ నారాయణను శాలువాతో సన్మానించారు. నాయకులు శివశంకర్, పరమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని షాలేం చర్చిలో మంగళవారం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను చర్చి సంఘం చైర్మన్ దేవదాసు, అధ్యక్షుడు దానం బాల్‌రాజ్ విడుదల చేశారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలు, అద్దాలు, ఎక్స్‌రే, ఈసీజీ, తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. సంఘం నాయకులు ప్రసాద్, విజయ్ రాహుల్, రవి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్‌కు సన్మానం



వెల్దండ: మండలంలోని పోషమ్మగడ్డతండాకు చెందిన సివిల్ ర్యాంకర్ యశ్వంత్‌నాయక్‌ను ఆదివారం మండల కేంద్రంలో నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని యశ్వంత్ నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణముదిరాజ్, ఎర్రశ్రీనుముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, నారాయణ, రమేష్, అలీ, భరత్‌గౌడు తదితరులు ఉన్నారు.